క్లుప్తంగా

హృదయ,ప్రాణ రక్షణ మెళకువలపై అవగాహన



హృదయ రక్షణ మెళకువలపై అవగాహన కలిగిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ అశోక్

నల్లజర్ల: ఆధునిక హృదయ రక్షణ మెళకువలపై నల్లజర్లలోని ఎస్సార్కే కళాశాల్లో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. లెఫ్టినెంట్ కల్నల్ వై.అశోక్ సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. కీలక ఘడియల్లో మరణిస్తున్న గుండెను తిరిగి తట్టి లేపుతూ ప్రాణం పోసే ప్రక్రియనే సీపీఆర్ అంటారన్నారు. ఆపత్కాలంలో ఆపన్న హస్తంలా నిలిచే ప్రక్రియే సీపీఆర్ అని ఆయనన్నారు. కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ కంఠమణి నారాయణ ప్రసాద్, ప్రిన్సిపాల్స్ కె.సుబ్రహ్మణ్యం, కిరణకుమార్, రమేష్ హాస్పిటల్ జనరల్ మేనేజరు పి.శివప్రసాద్, మార్కెటింగ్ మేనేజరు ఉమామహేశ్వరరాజు, రత్నాలబాబు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న లిటరరీ క్లబ్ గౌరవాధ్యక్షుడు పరిమి హరిచరణ్

కొవ్వూరు: ఆరికిరేవుల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు గోవర్ధనం శ్రీనివాసాచార్యులు కుమార్తె మధుమతి క్యాన్సర్ వైద్యానికి కొవ్వూరు లిటరరీ క్లబ్ తరపున శనివారం రూ.50 వేల ఆర్థిక సాయం చేశారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు పరిమి హరిచరణ్ చేతుల మీదుగా శ్రీనివాసాచార్యులకు ఈ సొమ్మును అందజేశారు.లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కంఠమణి రామకిషోర్, యనమదల సుబ్రహ్మణ్యం , గుత్తా వెంకటకృష్ణ, చావా రంగారావు, చావా రామారాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్‌లో ఎంపీడీవోకు సన్మానం



వడ్లూరు జగనన్న లేఅవుట్‌లో ఎంపీడీఓ శ్రీనివాస్‌ను సత్కరించిన దృశ్యం

ఉండ్రాజవరం: జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని వడ్లూరులోని గృహ లబ్ధిదారులతో జగనన్న లేఅవుట్‌లో శనివారం ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గణతంత్ర వేడుకల్లో ఉత్తమ ఎంపీడీఓగా అవార్డ్ అందుకున్న శ్రీనివాసును ఈ సందర్భంగా లబ్ధిదారుల సమక్షంలో గ్రామ ప్రజాప్రతినిధులు సత్కరించారు. అనంతరం లబ్ధిదారులకు హౌసింగ్ ఏఈ ఎం.విక్టర్‌బాబు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కఠారి సిద్ధార్థరాజు, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ , పంచాయతీ కార్యదర్శి ఎస్.భూపతి, వేంద్ర శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సార్కే కళాశాలలో 'కంఠమణి' కి నివాళి

నల్లజర్ల: మెట్ట ప్రాంతంలో ఉన్నత విద్యాభివృద్ధికి అంకురార్పణ చేసిన ధన్యజీవి కంఠమణి శ్రీనివాసరావు అని పలువురు కొనియాడారు. నల్లజర్లలో ఎస్సార్కే కళాశాల్లో ఆ కళాశాల వ్యవస్థాపక చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కంఠమణి శ్రీనివాసరావు 15వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన విగ్రహానికి చైర్మన్ నారాయణ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా విద్యాభివృద్ధికి కంఠమణి చేసిన సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు కండెపు వెంకట సుబ్రహ్మణ్యం, కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు

ఉండ్రాజవరం: ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో జీవనోపాదులను ఏర్పాటు చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రణాళికలు రూపొందించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సుభాషిణి అన్నారు. మండల సమాఖ్యలోని గ్రామ సంఘ సహాయకులు, మండల సమాఖ్య ప్రతినిధులతో చేయూత మహిళ మార్ట్, లైవ్ స్టాక్ (పాడి గేదెలు) హౌసింగ్ రుణాలపై శనివారం ఆమె సమీక్ష జరిపారు. ఉండ్రాజవరం మండల సమాఖ్య భవనంలో చేయూత డీపీఎం ఈ.రాజబాబు ఆధ్వర్యంలో ఈ సమీక్ష జరిగింది. చేయూత మహిళా మార్ట్ ఏర్పాటుకు విధి విధానాలను నిర్దేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏ.శ్రీనివాసు, హౌసింగ్ ఏఈ విక్టర్ బాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఏపీఎం, సీసీలు సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల తాగునీటి పైపులైన్ మార్పించండి

- గడప గడపకూ కార్యక్రమంలో కృష్ణంపాలెం వాసుల విజ్ఞప్తి
- సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే తలారి



కృష్ణంపాలెంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: తమ గ్రామంలో 40 ఏళ్ల క్రితం వేసిన తాగునీటి పైప్‌లైన్ శిథిలమైనందున కొత్త పైప్‌లైన్ వేయించాలని మండలంలోని కృష్ణంపాలెం ప్రజలు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కోరారు. ఆ గ్రామంలో శనివారం ఎమ్మెల్యే వెంకట్రావు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రజకుల చెరువు వద్ద 15 ఏళ్లుగా బోరు నిరుపయోగంగా ఉందని అక్కడి రజకులు ఎమ్మెల్యేకు వివరించారు. మోటార్‌కు విద్యుత్ బిల్లు రూ.70 నుంచి రూ. 80 వేలు వస్తోందని, బిల్లులు చెల్లించక పోవడంతో అధికారులు సరఫరాను నిలుపుదల చేశారని వివరించారు. విద్యుత్ బకాయిలను మాఫీ చేయించి, ఇకపై బిల్లును ప్రభుత్వం చెల్లించేలా వెసులుబాటు కల్పించాలని రజకులు ఎమ్మెల్యే వెంకట్రావును కోరారు. రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని, ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు ఆయనను కోరారు. గడప గడపకూ వెళ్లి ఎమ్మెల్యే వెంకట్రావు ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని ఎమ్మెల్యే వెంకట్రావు లబ్ధిదారులకు వివరించారు. పథకాల అమలు తీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్స్‌ను ఎమ్మెల్యే వెంకట్రావు ప్రజలకు అందజేశారు.

1.05 లక్షల గడపలను సందర్శించా

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 177 రోజులు గడపగడప కార్యక్రమం నిర్వహించానన్నారు.78 గ్రామ సచివాలయాల పరిధిలో దాదాపు 1.05 లక్షల గడపలను సందర్శించినట్టు తెలిపారు. ద్వారకాతిరుమల మండలంలో సీహెచ్ పోతేపల్లి, నల్లజర్లలో రెండు గ్రామ సచివాలయాల పరిధిలో గడప గడపకూ వెళ్లవలసి ఉందన్నారు. మూడు గ్రామ సచివాలయాలు పూర్తయితే నియోజకవర్గంలో గడపగడపకూ మన ప్రభుత్వం ముగుస్తుందని తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయానికి గడప గడపకూ నిధులు రూ.20 లక్షల చొప్పున మంజూరైనట్టు తెలిపారు. ఈ నిధులకు మండల పరిషత్, జెడ్పీ, నియోజకవర్గ ప్రత్యేక నిధులు జోడించి అభివృద్ధి పనులు చేస్తున్నట్టు వివరించారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, శ్మశానవాటికల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. కృష్ణంపాలెంలో గడపగడపకూ నిధులు రూ.10 లక్షల వ్యయంతో కొత్తగా మంచినీటి పైపులైన్ ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. రజకుల బోరు సమస్యను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పొగాకు బ్యారన్ వద్దకు వెళ్లి పొగాకును అల్లారు. కార్యక్రమంలో కృష్ణంపాలెం సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీష్‌రెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరశర్మ, వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, జిల్లా కార్యదర్శి గడా రాంబాబు, మాజీ ఎంపీపీ ఎం గంగరాజు, పార్టీ నాయకులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం



కాలనీలో ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని ఆరా తీస్తున్న కలెక్టర్ మాధవీలత

- కలెక్టర్ మాధవీలత
- కొవ్వూరు జగనన్న కాలనీ–1 సందర్శన

కొవ్వూరు: జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్తు, రోడ్ల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. పట్టణంలోని జగనన్న కాలనీ–1ను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకునేలా శ్రద్ధ తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నందున్న లబ్ధిదారుల్లో అవగాహన కల్పించి ఇళ్ల పనులు ప్రారంభించుకునేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపట్టడానికి ఎందుకు ముందుకు రావడం లేదో తెలుసుకుని క్షేత్రస్థాయిలో తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కాలనీలో ఎంత మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు? వాటిలో ఎన్ని నిర్మాణం ప్రారంభం అయ్యాయి? వంటి పనుల పురోగతిపై అధికారులను కలెక్టర్ మాధవీలత అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో ఎస్. మల్లిబాబు, మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, కమిషనర్ బి.శ్రీకాంత్, జిల్లా గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జ్ అధికారి జి.పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

రాగోలుపల్లిలో 60 మందికి నేత్ర పరీక్షలు

తాళ్లపూడి: లయన్స్ క్లబ్, రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం రాగోలపల్లి సొసైటీ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 10 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఈ శిబిరంలో ద కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ తాళ్లపూడి అధ్యక్షుడు పిండి గణపతి, సొసైటీ అధ్యక్షుడు మద్దుకూరి దొరబాబు, సొసైటీ కార్యదర్శి కె.భాస్కర్, లయన్స్ క్లబ్ సభ్యులు చలపాటి ప్రకాష్, నీరుకొండ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రక్కిలంకలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రక్కిలంకలోని ప్రసన్న నర్సింగ్ హోమ్ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు డాక్టర్ భానుప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో 40 ఏళ్లు పైబడిన వారికి ఉచితంగా సాధారణ, నరాలు, గుండె, కిడ్నీ, దంత, క్యాన్సర్ పరీక్షల నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

నేడు చెరుకుమిల్లిలో వైద్య శిబిరం

గోపాలపురం: మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని చెరుకుమిల్లి సర్పంచ్ ముళ్లపూడి వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన భర్త ముళ్ళపూడి విష్ణుమూర్తి జ్ఞాపకార్థం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. రాజమహేంద్రానికి చెందిన హెలోయిస్ ఆసుపత్రి వైద్యులు ఉచితంగా రోగులకు పరీక్షలు చేసి, మందులు అందజేస్తారన్నారు. చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వరలక్ష్మి కోరారు.

వృద్ధుడి ఆత్మహత్య

నిడదవోలు రూరల్: భార్యపై అనుమానంతో పురుగు మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిడదవోలు మండలం ఉనకరమిల్లి గ్రామంలో చోటుచేసుకుంది. సమిశ్రగూడెం ఏఎస్సై పరమహంస తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆ గ్రామానికి చెందిన జుత్తుగ నాగేశ్వరరావు (61) తన భార్య గోగులమ్మ వేరే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో శనివారం మధ్యాహ్నం పురుగు మందు తాగి మృతిచెందాడు. దీనిపై అతని కుమార్తె రాజరాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు రాజు ఎంపిక

చాగల్లు: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని మార్కొండపాడు జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి యు.రాజు ఎంపికయ్యాడు. ఈ నెల 23 నుంచి 26 వరకూ కర్నూలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్–17 స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీల్లో రాజు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు తరఫున పాల్గొని ప్రతిభ కనబరిచాడని పాఠశాల హెచ్‌ఎం టి.శ్రీనివాస్ తెలిపారు. దీంతో వాలీబాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికైన రాజు త్వరలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు.



రాజుతో మార్కొండపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దారి మళ్లుతున్న వృక్ష సంపద

కొవ్వూరు: పట్టణ రైల్వే స్టేషన్ నుంచి పార్కుకు వచ్చే రోడ్డులోని భారీ వృక్షాలు ఒక్కటొక్కటిగా నేలకొరుగుతున్నాయి. అక్రమంగా వాటిని కొందరు నరికివేసి ట్రాక్టర్లపై తరలించుకు పోతున్నారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకుకోవడం లేదు. నాధులే కనిపించడం లేదు. ఈ విషయంపై స్థానికులు పురపాలక సంఘం కమిషనర్ బి.శ్రీకాంత్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ చెట్లు తమ పరిధి కాదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు, ఫారెస్ట్ అధికారులకు చెప్పాలని సూచించినట్లు చెబుతున్నారు. స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తే చెట్లు పురపాలక సంఘానివే అని చెబుతున్నారు.



కొవ్వూరు రైల్వే స్టేషన్ సమీపంలో నరికేసిన చెట్టు

భక్తి శ్రద్ధలతో రథ సప్తమి పూజలు

- సూర్యభగవానికి నైవేద్యంగా క్షీరాన్నం
- వేలివెన్నులో ఘనంగా స్వామి వారి కల్యాణం

ఉండ్రాజవరం: రథ సప్తమి పండగను శనివారం పలు గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు వేకువజామునే పుణ్య స్నానాలు ఆచరించి కొబ్బరి పిందెలు, ఈనెలతో రథాలను తయారు చేసి, వాటిని చిక్కుడు పూలతో అలంకరించారు. ఆవుపాలను వేరు పిడకల పొయ్యిపై పొంగించి తయారు చేసిన క్షీరాన్నాన్ని సూర్యనారాయణ స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు.

మండలంలోని వేలివెన్నులోని సూర్య భగవానుని ఆలయంలో రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉష, ఛాయ, పద్మిని, సంజ్ఞా సహిత సూర్యనారాయణస్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

సాయంత్రం మహిళలు స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద ఆదివారం నిర్వహించే అన్న సమారాధనను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

ప్రక్కిలంకలో వైభవంగా రథోత్సవం

తాళ్లపూడి: రథసప్తమి సందర్భంగా శనివారం మండలంలోని ప్రక్కిలంకలో వైభవంగా సూర్యభగవానుని రథయాత్ర నిర్వహించారు. ప్రక్కిలంక, పైడిమెట్ట, తాళ్లపూడి గ్రామాల వీధుల గుండా రథోత్సవం అట్టహాసంగా సాగింది. అంతకు ముందు అర్చకుడు కొతవరపు విశ్వనాథ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సూర్యనారాయణమూర్తికి తామర పుష్పాలతో సహస్ర నామార్చన చేశారు. శశిశేఖర మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథోత్సవంలో అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. చిన్నారులు కోలాటాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా విశ్వనాథశర్మ, టీటీడీ ధర్మప్రచార పరిషత్ సభ్యుడు పరస రాధాకృష్ణలు మాట్లాడుతూ రథ సప్తమి విశిష్టతను భక్తులకు వివరించారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో సౌరయాగం

కొవ్వూరు: స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి ఆలయంలోని సూర్యనారాయణమూర్తికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు.అనంతరం సూర్యనమస్కారాలు, అరుణ పారాయణ నిర్వహించారు. ఆలయంలో సౌరయాగం చేశారు. అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి పూజలను పర్యవేక్షించారు. గోష్పాద క్షేత్రంలోని సుందరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ఉప ఆలయంలోను రథ సప్తమి సందర్భంగా పూజలు నిర్వహించారు. సూర్యనమస్కారాలు, అరుణ పారాయణ చేశారు.

నిడదవోలు: పట్టణంలోని బాలాత్రిపురసుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సూర్య భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీకాకుళం లక్ష్మీనరసింహశాస్త్రి, అభిరామ్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు సూర్య నమస్కారాలు చేసి స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కొండా విజయకృష్ణ ఫణీంద్ర, ఆలయ ఈఓ సోమాల శివ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో సౌరయాగం చేస్తున్న రుత్విక్కులు



వేలివెన్నులో సూర్య భగవానుని ఊరేగింపులో పల్లకీ మోస్తున్న మహిళలు



ప్రక్కిలంకలో సూర్యనారాయణ మూర్తి రథోత్సవం సందడి



నిడదవోలు సోమేశ్వరస్వామి ఆలయంలో సూర్య నమస్కారాలు

పదోన్నతి పొందిన తహసీల్దార్‌కు సత్కారం



శ్రీనివాసరావును సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

కొవ్వూరు: పదోన్నతిపై పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)గా వెళుతున్న చాగల్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావును శనివారం సాయంత్రం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఆర్డీవో ఎస్.మల్లిబాబు మాట్లాడుతూ శ్రీనివాసరావు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానంలోకి వెళ్లాలని ఆకాంక్షించారు. తహసీల్దార్లు బి.నాగరాజు నాయక్ డివిజన్‌లో తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నాప్ డ్రామాకు బాధితుడే సూత్రధారి

- చెల్లెలి నిశ్చితార్థానికి ఇంట్లో ఉన్న డబ్బులను కాజేసేందుకు అన్న స్కెచ్
- కేసు ఛేదించి ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడిన నిందితులు

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం సమిశ్రగూడెం– వేలివెన్ను రోడ్డులో ఈ నెల 24న ఉదయం జరిగిన యువకుడి కిడ్నాప్ కేసును పోలీసులు ఛేదించారు. కిడ్నాపైన యువకుడే ఈ కేసులో ప్రధాన నిందితుడిగా నిర్ధారించారు. నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులకు పలు కీలక విషయాలు వెలుగుచూశాయి. తండ్రి వద్ద డబ్బులను కాజేసేందుకు ప్రయత్నించిన కుమారుడు వెంకటేష్‌తో పాటు అతనికి సహకరించిన స్నేహితులు బండారు సతీష్‌కుమార్, చెల్లూరి అనిల్ వెంకటశివలను శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కోరుపల్లికి చెందిన నిచ్చెనకోళ్ల రాము, అతని కుమారుడు వెంకటేష్ నిడదవోలులో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నారు. వెంకటేష్ గత కొంతకాలంగా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ స్నేహితుల వద్ద అప్పులు చేశాడు. మరికొద్ది రోజుల్లో కూతురి నిశ్చితార్థం కోసం ఇంట్లో డబ్బులు పెట్టుకున్న తండ్రి రాము వద్ద కిడ్నాప్ నాటకం ఆడి ఆ డబ్బులు రాబట్టేందుకు స్కెచ్ వేశాడు. వెంకటేష్‌తో పాటు అతని స్నేహితులైన నిడదవోలుకు చెందిన టిఫిన్ దుకాణంలో పనిచేస్తున్న బండారు సతీష్‌కుమార్, ఆటోమొబైల్స్ షాపులో పనిచేస్తున్న అనిల్ వెంకట్ శివలు కలిసి కిడ్నాప్ డ్రామా ఆడారు. వేలివెన్ను రోడ్డులో టీవీఎస్ మోపెడ్ వాహనం పడవేసి వీరంతా కారులో చిక్కాల, పల్లంట్ల, దేవరపల్లి, కొయ్యలగూడెం ప్రాంతాల్లో కలియ తిరుగుతూ వెంకటేష్ సెల్‌ఫోన్ నుంచే తండ్రి రాముకు ఫోన్ చేసి రూ.30 లక్షలు ఇవ్వాలని లేకపోతే మీ కొడుకుని చంపేస్తామని బెదిరించారు. దీంతో రాము సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. కిడ్నాప్ జరిగిన అర్థరాత్రి కొవ్వూరు మండలం ఐ.పంగిడి–కాపవరం మధ్య అడ్డ రోడ్డులో వెంకటేష్‌ను సురక్షితంగా వదిలి వేయడంతో అనుమానం వచ్చిన పోలీసులు పలు కోణాల్లో విచారించగా పొంతన లేని సమాధానాలు చెప్పిన నిందితుడు వెంకటేష్ అడ్డంగా దొరికిపోయాడు. కిడ్నాప్ నాటకం ద్వారా తండ్రి రాము నుంచి కాజేసిన డబ్బుల్లో మిగిలిన ఇద్దరు స్నేహితులకు రూ.2 లక్షలు చొప్పున ఇస్తానని చెప్పినట్లు తెలిసింది.

షిర్డీ సాయి వార్షికోత్సవం ప్రారంభం



షిర్డీ సాయి మందిరం వద్ద నిర్వహిస్తున్న లక్ష్మీగణపతి హోమం

దేవరపల్లి: స్థానిక షిర్డీ సాయినాథుని మందిర వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. రథసప్తమి పర్వదినం కావడంతో అనంతరం మందిరం వద్ద సామూహిక పాలపొంగళిని సూర్య నమస్కారాలతో అర్పించారు. ఘంటసాల ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు బాబా ఆశీస్సులు పొందారు.

జమున మృతి సినీ పరిశ్రమకు లోటు

కొవ్వూరు: తెలుగుచిత్ర పరిశ్రమకు నటి జమున వన్నె తెచ్చారని, ఆమె మృతి సినీ రంగానికి తీరని లోటు అని ఏఎస్ఆర్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలగర వెంకట రంగారావు పేర్కొన్నారు.జమున పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.

చాగల్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నిరంజన్



చాగల్లు: చాగల్లు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావుకు ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావును అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్ పురం ప్రాజెక్ట్ -2 కు డిప్యూటీ కలెక్టరుగా ప్రభుత్వం నియమించింది. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరావు స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ కె.నిరంజన్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించనున్నారు.

పోలీసులకు చిక్కిన ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ల చోరుడు

ఉండ్రాజవరం: ఒకే గ్రామంలో రెండు వేర్వేరు చోట్ల రెండు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడిన తణుకు శివాలయం వీధికి చెందిన సిర్రాపు నాగ మురళీకృష్ణ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఉండ్రాజవరం ఎస్సై కె.రామారావు శనివారం తెలిపారు. అతడి వద్ద నుంచి 2 ల్యాప్‌ట్యాప్‌లు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం నిందితుడు నాగమురళీకృష్ణ గతేడాది డిసెంబర్ 30న చివటంలోని కమ్మ కల్యాణ మండపం వద్ద వి.జయరాం అనే వ్యక్తికి చెందిన ల్యాప్‌టాప్, రెండు సెల్‌ఫోన్లు కాజేశాడు. అలాగే ఈనెల 10న చివటం గ్రామంలోని పాత బెల్లం మార్కెట్ వద్ద కృష్ణన్ అనే వ్యక్తి ఆఫీసులో ల్యాప్‌టాప్‌ను కూడా నాగమురళీకృష్ణ కాజేశాడు. రెండు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి పోలీసులు అతడి కోసం గాలింపు చేపట్టారు. తుదకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నాగమురళీకృష్ణను అరెస్టు చేసి తణుకు కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా ఆయన రిమాండ్‌కు ఆదేశించారు. కాగా నిందితుడు తణుకు, తణుకు రూరల్, ఉండ్రాజవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 12 ఆస్తి నేరాలకు పాల్పడినట్టు ఎస్సై కె.రామారావు తెలిపారు.